పొట్టిపోరుకు సై

నేటి నుంచి మహిళల టీ20 వరల్డ్ కప్.. బరిలో పది జట్లు

టైటిల్ ఫేవరేట్‌గా టీమ్‌ఇండియా.. ఏడోసారి కప్ కొట్టేందుకు ఆసీస్ తహతహ

మహిళల టీ20 ప్రపంచకప్ పోరుకు రంగం సిద్ధమైంది. యూనైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ) వేదికగా 10 జట్లు మెగాటోర్నీలో తలపడబోతున్నాయి. గురువారం నుంచి మొదలయ్యే పొట్టిప్రపంచకప్‌లో రసవత్తర పోరాటాలకు తెరలేవనుంది. అభిమానులను మునివేళ్లపై నిలబెడుతూ బౌండరీలు చిన్నబోయేలా అమ్మాయిలు అదరగొట్టేందుకు సర్వశక్తులు ఒడ్డనున్నారు. క్షణకాలంలో ఫలితం మారే టీ20ల్లో ప్రపంచ చాంపియన్‌గా నిలిచేందుకు పక్కాప్రణాళికతో కదంతొక్కనున్నారు. ఆరుసార్లు విజేతగా నిలిచిన ఆస్ట్రేలియా 'ఏడో'సారి కన్నేస్తే..ఈసారైనా కప్ ముద్దాడాలన్న కసితో భారత్ కనిపిస్తున్నది. కరీబియన్ గడ్డపై చరిత్రసృష్టించిన రోహిత్‌సేనను స్ఫూర్తిగా తీసుకుంటూ సత్తా చాటాలని టీమ్‌ఇండియా పట్టుదలతో ఉన్నది.

దుబాయ్: మూడు నెలల క్రితం యూఎస్ఏ, వెస్టిండీస్ వేదికలుగా ముగిసిన ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్ తర్వాత క్రికెట్ అభిమానులను మరోసారి అలరించేందుకు మరో టీ20 విందు సిద్ధమైంది. గురువారం (అక్టోబర్ 3) నుంచి యూనైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) వేదికగా మహిళల పొట్టి ప్రపంచకప్‌నకు తెరలేవనుంది. వాస్తవానికి ఈ టోర్నీకి బంగ్లాదేశ్ ఆతిథ్యమివ్వాల్సి ఉన్నా ఆగస్టులో అక్కడ నెలకొన్న రాజకీయ అనిశ్చితితో ఐసీసీ ఈ మెగా పోరును యూఏఈకి తరలించింది. 9వ ఎడిషన్‌గా జరుగబోయే తాజా టోర్నీలో ఏడోసారి టైటిల్ కైవసం చేసుకునేందుకు ఆస్ట్రేలియా భావిస్తుండగా కంగారుల ఆధిపత్యానికి గండి కొట్టేందుకు భారత్, ఇంగ్లండ్, సౌతాఫ్రికా, న్యూజిలాండ్, వెస్టిండీస్ వంటి జట్లు పూర్తిస్థాయి అస్త్రశస్త్రాలతో సన్నద్ధమయ్యాయి. ఈ టోర్నీలో ఇంతవరకూ గ్రూప్ దశను దాటని పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంకతో పాటు అరంగేట్ర జట్టు స్కాట్లాండ్ సత్తా చాటేందుకు సిద్ధమయ్యాయి. గురువారం జరిగే డబుల్ హెడర్‌లో భాగంగా తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌ను స్కాట్లాండ్ ఢీకొనగా రెండో మ్యాచ్‌లో పాకిస్థాన్.. శ్రీలంకతో తలపడనుంది.

టోర్నీ ఫార్మాట్ ఇలా..

అక్టోబర్ 3 నుంచి 20 దాకా యూఏఈలోని దుబాయ్, షార్జా వేదికలుగా జరుగబోయే ఈ మెగా టోర్నీలో మొత్తం 23 మ్యాచ్‌లు ఉన్నాయి. గ్రూప్ దశలో 20 మ్యాచ్‌లు, రెండు సెమీస్‌లు, ఫైనల్ జరుగనుంది. పది జట్లను రెండు గ్రూపులుగా విభజించారు. గ్రూప్ దశలో భాగంగా ఒక్కో జట్టు గ్రూపులోని మరో జట్టుతో ఒక మ్యాచ్ (మొత్తం నాలుగు) ఆడనుంది. గ్రూప్ దశలో టాప్-2 జట్లు సెమీస్‌కు అర్హత సాధిస్తాయి. అక్టోబర్ 17, 18న సెమీస్ మ్యాచ్‌లు జరగాల్సి ఉండగా 20న దుబాయ్ వేదికగా ఫైనల్ జరుగుతుంది.

ఆసీస్ ఆధిపత్యాన్ని నిలువరించేనా?

తొమ్మిదో ఎడిషన్‌గా జరుగుతున్న ఈ టోర్నీలో ఆస్ట్రేలియా ఏకంగా ఆరుసార్లూ టైటిల్ నెగ్గి ఒకసారి రన్నరప్‌గా నిలిచిందంటేనే ఆ జట్టు ఆధిపత్యం ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగుతున్న కంగారూలు ఈసారి అలిస్సా హీలి నేతృత్వంలో ఆడనున్నారు. దిగ్గజ సారథి మెగ్‌లానింగ్ సారథ్యంలో గత ఎడిషన్ (2022) ఫైనల్‌లో దక్షిణాఫ్రికాను వారి సొంతగడ్డపైనే చిత్తుచేసిన ఆసీస్.. యూఏఈలోనూ అదే మ్యాజిక్‌ను రిపీట్ చేయాలని పట్టుదలతో ఉంది. హీలితో పాటు ఆష్లే గార్డ్‌నర్, ఎల్లీస్ పెర్రీ, తహిలా మెక్‌గ్రాత్, బెత్ మూనీ వంటి ప్రపంచ స్థాయి ఆటగాళ్లు ఆ జట్టు సొంతం. అయితే ఈసారి ఆసీస్‌కు టైటిల్ నెగ్గడం అంత సులభమైతే కాదు. గత రెండేండ్ల కాలంలో భారత్, ఇంగ్లండ్, సౌతాఫ్రికా వంటి జట్లు నిలకడగా రాణిస్తుండగా న్యూజిలాండ్ సైతం మెరుగైన ఆటతీరుతో కంగారూలకు కళ్లెం వేసేందుకు సిద్ధమైంది.

భారత్ ఈసారైనా?

సుమారు దశాబ్దకాలం తర్వాత భారత ఐసీసీ ట్రోఫీ కలను నెరవేర్చిన పురుషుల జట్టు ఇచ్చిన గెలుపు స్ఫూర్తితో హర్మన్‌ప్రీత్ కౌర్ సేన టోర్నీకి సిద్ధమైంది. టీ20 వరల్డ్‌కప్ తొలి ఎడిషన్ (2009) నుంచి ఆడుతున్నా భారత్ ఇప్పటిదాకా టైటిల్ నెగ్గలేదు. 2020 ఎడిషన్ ఫైనల్‌లో ఆసీస్ చేతిలోనే ఓడి రన్నరప్‌తో సరిపెట్టుకుంది. గత ఎడిషన్‌లోనూ సెమీస్‌లో కంగారూలే మన టైటిల్ వేటకు అడ్డుపడ్డారు. గెలుపు దిశగా సాగుతున్న ఆ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ రనౌట్‌తో భారత అభిమానులు గుండె పగిలింది. కానీ గత రెండేండ్లలో ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) వల్ల భారత్ బాగా మెరుగైంది. హర్మన్‌ప్రీత్, స్మృతి మంధాన, దీప్తి శర్మ వంటి సీనియర్లతో పాటు షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్, శ్రేయాంక పాటిల్ వంటి మెరికల్లాంటి ఆటగాళ్లు మన సొంతం. యూఏఈ పిచ్‌లు స్పిన్నర్లకు అనుకూలంగా ఉండనున్న నేపథ్యంలో దీప్తి, శ్రేయాంక, రాధా యాదవ్ కీలకం కానున్నారు. అయితే ఈ ఏడాది పొట్టి ఫార్మాట్‌లో భారత్ ఏడు మ్యాచ్‌లు మాత్రమే ఆడటం గమనార్హం. గ్రూప్-ఏలో ఉన్న భారత్.. ఈనెల 4న న్యూజిలాండ్‌తో జరిగే మ్యాచ్‌తో టైటిల్ వేటను మొదలుపెట్టనుంది. అక్టోబర్ 6న దాయాది పాకిస్థాన్‌తో ఆడుతుంది. 2018 నుంచి జట్టును నడిపిస్తున్న హర్మన్‌ప్రీత్‌పై ఈసారి ఒత్తిడి అధికంగా ఉంది. కీలక మ్యాచ్‌లలో ఒత్తిడి నుంచి బయటపడగలిగితే టైటిల్‌ను సొంతం చేసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు.

భారత్ షెడ్యూల్

అక్టోబర్ 04	భారత్ X న్యూజిలాండ్	దుబాయ్	రా. 7:30 గం.
అక్టోబర్ 06	భారత్ X పాకిస్థాన్	దుబాయ్	మ. 3:30 గం.
అక్టోబర్ 09	భారత్ X శ్రీలంక	దుబాయ్	రా. 7:30 గం.
అక్టోబర్ 13	భారత్ X ఆస్ట్రేలియా	షార్జా	రా. 7:30 గం.

గ్రూప్ - ఏ: భారత్, పాకిస్థాన్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, శ్రీలంక

గ్రూప్- బీ: ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్, బంగ్లాదేశ్, స్కాట్లాండ్

భారత్ పసిడి జోరు

లిమా (పెరూ): ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో భారత యువ షూటర్లు పతకాల పంట పండిస్తున్నారు. టోర్నీ నాలుగో రోజు భారత్‌కు ఏకంగా 5 స్వర్ణాలు, రెండు రజతాలు దక్కాయి. పురుషుల 25 మీటర్ల జూనియర్ పిస్టల్ ఫైనల్‌లో ముకేశ్ స్వర్ణం గెలవగా భారత్‌కే చెందిన సూరజ్ శర్మకు రజతం దక్కింది. ఇదే విభాగపు టీమ్ ఈవెంట్‌లో ముకేశ్, సూరజ్, ప్రధ్యుమ్న్ పసిడి గెలుచుకున్నారు. మహిళల 25 మీటర్ల పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో దివ్యాన్షి, తేజస్విని, విభూతి బంగారు పతకం సాధించారు. ఇదే విభాగం వ్యక్తిగత ఫైనల్‌లో దివ్యాన్షి అగ్రస్థానంలో నిలిచి స్వర్ణం ముద్దాడింది. ఈ టోర్నీలో భారత్ ఇప్పటికే 10 స్వర్ణాలతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతున్నది.

అల్కారజ్‌దే చైనా ఓపెన్

ఫైనల్‌లో సిన్నర్‌కు పరాభవం

బీజింగ్: హోరాహోరీగా సాగిన చైనా ఓపెన్ టెన్నిస్ టోర్నీ పురుషుల సింగిల్స్ ఫైనల్స్‌లో స్పెయిన్ కుర్రాడు కార్లోస్ అల్కారజ్ విజేతగా నిలిచాడు. ఫైనల్‌లో రెండో సీడ్ అల్కారజ్ 6-7 (6/8), 6-4, 7-6 (7/3) తో డిఫెండింగ్ చాంపియన్ జన్నిక్ సిన్నర్ (ఇటలీ)ను ఓడించి టైటిల్ గెలిచాడు. ఇరువురి మధ్య సుమారు మూడున్నర గంటల పాటు రసవత్తరంగా సాగిన పోరులో విజయం కోసం కుర్రాళ్లిద్దరూ నువ్వానేనా అన్నట్టుగా తలపడ్డారు. తొలి సెట్‌ను టైబ్రేక్‌తో సిన్నర్ గెలుచుకోగా రెండో సెట్ ఒక దశలో 4-3తో వెనుకబడ్డా అల్కారజ్ అనూహ్యంగా పుంజుకుని ఆ సెట్‌ను సొంతం చేసుకున్నాడు. ఇక నిర్ణయాత్మక మూడో సెట్ కూడా టై బ్రేక్‌కు వెళ్లగా అందులో అల్కారజ్.. 0-3తో ఉన్నా వరుసగా ఏడు పాయింట్లు గెలిచి సెట్‌తో పాటు మ్యాచ్‌నూ గెలుచుకున్నాడు. ఈ ఏడాది సిన్నర్‌పై అల్కారజ్‌కు ఇది వరుసగా మూడో విజయం. ఈ టోర్నీ మహిళల సింగిల్స్‌లో కోకో గాఫ్, అరీనా సబలెంక, ఆండ్రీవా వంటి టాప్ సీడ్ ప్లేయర్లు క్వార్టర్స్ చేరారు.

సర్ఫరాజ్ డబుల్ సెంచరీ

ఇరానీ కప్

లక్నో: రంజీ చాంపియన్ ముంబై, రెస్టాఫ్ ఇండియా జట్ల మధ్య లక్నో వేదికగా జరుగుతున్న ఇరానీ కప్‌లో యువ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ ద్విశతకం (276 బంతుల్లో 221 నాటౌట్, 25 ఫోర్లు, 4 సిక్సర్లు)తో మెరిశాడు. 237/4 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండో రోజు ఆరంభించిన ముంబై.. సర్ఫరాజ్ దూకుడుతో భారీ స్కోరు సాధించింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆ జట్టు 9 వికెట్ల నష్టానికి 536 పరుగుల భారీ స్కోరు చేసింది. కెప్టెన్ అజింక్యా రహానే (97) తృటిలో శతకం కోల్పోగా తనుష్ కొటియాన్ (64), శార్దూల్ ఠాకూర్ (36) రాణించారు.

పల్లె ప్రతిభను ప్రోత్సహించేలా

హైదరాబాద్, ఆట ప్రతినిధి: పల్లెల్లో దాగున్న ప్రతిభను ప్రోత్సహించేలా సీఎం కప్-2024 నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందులో భాగంగా దాదాపు రెండు నెలల పాటు గ్రామీణ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో క్రీడాపోటీల నిర్వహణకు సమాయత్తమైంది. ఇందులో భాగంగా బుధవారం ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి పలు అంశాలపై మాట్లాడుతూ 'గ్రామీణ యువతలో దాగున్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు సీఎం కప్ నిర్వహిస్తున్నాం. పల్లే క్రీడాకారులను ప్రపంచ చాంపియన్లుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకెళుతున్నాం. గురువారం సీఎం కప్ టోర్నీ లోగో, మస్కట్‌ను రేవంత్‌రెడ్డి ఆవిష్కరిస్తారు' అని అన్నారు.

భారత్‌లో ఖో ఖో వరల్డ్ కప్

ఢిల్లీ: వచ్చే ఏడాది భారత్ వేదికగా 'ఖో ఖో ప్రపంచకప్'ను నిర్వహించనున్నట్టు భారత ఖో ఖో సమాఖ్య (కేకేఎఫ్ఐ) బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ టోర్నీలో ఆరు ఖండాల నుంచి 16 పురుషుల, 24 మహిళల జట్లు పాల్గొననున్నాయి. '2032 ఒలింపిక్స్‌లో ఖో ఖో ను క్రీడాంశంగా చేర్చే దిశగా ఈ ప్రపంచకప్ ఎంతగానో ఉపయోగపడుతుంది' అని కేకేఎఫ్ అధ్యక్షుడు సుధాన్షు మిట్టల్ తెలిపాడు.

బాబర్ మళ్లీ..

పరిమిత ఓవర్ల సారథ్యానికి రాజీనామా

లాహోర్: పాకిస్థాన్ పరిమిత ఓవర్ల క్రికెట్ జట్టు సారథి బాబర్ ఆజమ్ మరోసారి కెప్టెన్సీ బాధ్యతలకు గుడ్‌బై చెప్పాడు. వన్డే, టీ20 కెప్టెన్సీకి రాజీనామా చేస్తున్నట్టు బుధవారం ఎక్స్ వేదికగా ప్రకటించాడు. అతడు ఇలా చేయడం ఏడాదికాలంలో ఇది రెండోసారి. గతేడాది భారత్‌లో జరిగిన వన్డే ప్రపంచకప్‌లో పాక్ గ్రూప్ దశకే పరిమితమవడంతో అతడు కెప్టెన్సీని వదులుకున్నా కొద్దిరోజుల తర్వాత పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) మళ్లీ అతడికి ఆ బాధ్యతలను అప్పజెప్పింది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.